andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.4 ; కనిష్ఠం 15.2



నిర్మల్
జిల్లా వార్తలు

సోమవారం 25 నవంబరు 2024

ఎన్ఎంఎంఎస్ పరీక్షా కేంద్రాల సందర్శన

నిర్మల్ కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలో నిర్వహిస్తున్న ఎన్ఎంఎంఎస్ పరీక్షా కేంద్రాలను డీఈవో పి.రామారావు ఆదివారం సందర్శించారు. జిల్లాలోని నిర్మల్‌లో 2, భైంసాలో 2, ఖానాపూర్‌లో 1 కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాయాలని సూచించారు. కాపీయింగ్‌కు పాల్పడవద్దన్నారు. మొత్తం 339 విద్యార్థులకు గాను 332 మంది హాజరయ్యారని డీఈవో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు రవిబాబు, పర్యవేక్షకుడు కిషన్, లింబాద్రి, డీఈవో వెంట ఉన్నారు.

నేటి నుంచి సన్నాలకు బోనస్



కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు తెచ్చిన వరి ధాన్యం

- జిల్లాలో 119 కొనుగోలు కేంద్రాల ద్వారా సన్న రకం ధాన్యం సేకరణ
- ఈ ఖరీఫ్ ధాన్యం సేకరణ లక్ష్యం 62,370 మెట్రిక్ టన్నులు
- క్వింటాల్ ధాన్యంపై ఎంఎస్‌పీ ధరపై అదనంగా రూ.500లు చెల్లింపు
- తొలుత రైతన్న ఖాతాలోకి ఎంఎస్‌పీ డబ్బులు
- ఎంఎస్‌పీ డబ్బులు జమైన 48 గంటల్లో బోనస్ డబ్బులు
- ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా సన్న రకాలను విక్రయించిన 873 మంది రైతులు
- సన్న రకాలకు బోనస్‌తో లబ్ధి చేకూరుతుందని అన్నదాత ఆనందం
- సర్కారు నిర్ణయంతో రైతన్నకు తప్పనున్న దళారుల బెడద

ఖానాపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ఈసారి రేవంత్ సర్కారు రైతన్నను ప్రసన్నం చేసుకునే దిశగా తన హామీలను అమలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన సన్నరకం వరి ధాన్యాన్ని విక్రయించాలంటే ఇన్నాళ్లు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించక తప్పని పరిస్థితి తలెత్తింది. దీంతో కొన్ని సందర్భాల్లో వ్యాపారులు రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యానికి సరిపడా చెల్లింపులు చేయకుండా చేతులు ఎత్తేసి అన్నదాతను నిండా ముంచేవారు. ఇకపై ఇటువంటి మోసాలకు తావు లేకుండా తెలంగాణ ప్రభుత్వం రైతన్న పండించిన సన్నరకం ధాన్యాన్ని ఎంఎస్‌పీ ధరపై క్వింటాల్ ధాన్యానికి రూ. 500లు అదనపు చెల్లింపులు (బోనస్) చేసి కొనుగోలు చేసేందుకు సిద్ధమైంది. ఈ దిశగా అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో రైతన్న ఖాతాల్లో సన్న రకం ధాన్యంపై బోనస్ డబ్బులను జమ చేసేలా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో నేటి నుంచి నిర్మల్ జిల్లాలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్న రకం ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ కానున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

జిల్లా వ్యాప్తంగా 119 సన్న రకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు

నిర్మల్ జిల్లా వ్యాప్తంగా సన్న రకం వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం 119 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు నిర్మల్ జిల్లాలో 873 మంది రైతులు 4,496 మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యాన్ని విక్రయించినట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఈ ఖరీఫ్‌లో వచ్చిన దిగుబడి ఆధారంగా సన్నరకం వరి ధాన్యం కొనుగోలు లక్ష్యం 62,370 మెట్రిక్ టన్నులుగా అధికారులు చెబుతున్నారు. దొడ్డు రకం ధాన్యంతో పోలిస్తే పంట కాలం ఎక్కువ అయినందున ఇప్పుడిప్పుడే సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. రైతు పండించిన సన్నరకం ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోకుండా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం కొనుగోళ్లను నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు.

బోనస్‌తో అదనపు ఆదాయం



● రామిడి మహేష్, తర్లపాడ్

తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన క్వింటాల్ సన్న రకం ధాన్యానికి రూ. 500ల బోనస్‌తో రైతులకు అదనపు ఆదాయం చేకూరుతుంది. గతంలో సన్న రకం ధాన్యం పండించిన రైతు ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయించి ఇబ్బందులు పడేవాళ్లం. తాజాగా ప్రభుత్వం నిర్ణయంతో దర్జాగా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకునే వెసులుబాటు దక్కింది.

48 గంటలలోపు బోనస్ డబ్బుల జమ

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతన్న పండించిన సన్న రకం ధాన్యంపై క్వింటాల్‌కు రూ.500ల బోనస్‌ను చెల్లించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. దీంతో నేటి నుంచి సన్న రకం ధాన్యంపై క్వింటాల్‌కు రూ.500ల అదనపు చెల్లింపులు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. సన్న రకం ధాన్యాన్ని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతుల ఖాతాల్లో తొలత ప్రభుత్వం నిర్ణయించిన ఎంఎస్‌పీ ధర ప్రకారం క్వింటాల్‌కు రూ. 2,320 చొప్పున రైతులకు చెల్లింపులు చేస్తారని అధికారులు చెబుతున్నారు. ఎంఎస్‌పీ ప్రకారం రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులను జమ చేసిన 48 గంటలలోపు తెలంగాణ ప్రభుత్వం అదనంగా క్వింటాల్‌కు రూ.500ల చొప్పున అందజేస్తున్న బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని అధికారులు చెబుతున్నారు. సన్న రకం ధాన్యం కొనుగోళ్లలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నుంచి అధికారులకు ఆదేశాలు అందినట్లు చెబుతున్నారు.

అన్నదాతకు తప్పనున్న దళారుల బెడద

సన్న రకాలకు క్వింటాల్‌కు రూ.500ల చొప్పున బోనస్ అందజేయాలని తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో క్షేత్రస్థాయిలో రైతన్నకు దళారుల బెడద తప్పనున్నట్లు చెబుతున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం ఏర్పాటు చేసే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏ గ్రేడ్ ధాన్యంగా పరిగణించబడే దొడ్డు రకం ధాన్యానికి అందించే రూ. 2,320 ఎంఎస్‌పీ ధరను మాత్రమే సన్న రకం ధాన్యానికి సైతం అందించేవారు. దీంతో దొడ్డు రకంతో పోలిస్తే దిగుబడి తక్కువగా వచ్చే సన్నరం ధాన్యం ప్రభుత్వం అందించే ఎంఎస్‌పీ ధరకు విక్రయిస్తే రైతన్నకు తీవ్ర నష్టాలు తెచ్చి పెట్టేది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల కంటే ప్రైవేట్ వ్యాపారులు ఇచ్చే ధర రూ.300 నుంచి రూ. 400ల వరకు అదనంగా ఉండడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులవైపే మొగ్గు చూపేవారు. కొన్ని సందర్భాల్లో ఈ ప్రైవేట్ వ్యాపారులు రైతులకు పూర్తి చెల్లింపులు చేయ కుండా మోసాలకు పాల్పడిన ఘటనలు చోటు చేసుకునేవి. దీంతో సన్న రకం ధాన్యాన్ని పండించి దళారుల పాలు చేయడం ఎందుకని రైతన్న దొడ్డు రకం ధాన్యం పండించేందుకే మొగ్గు చూపేవారు. కాగా తాజాగా తెలంగాణ ప్రభుత్వం నిర్ణయంతో దర్జాగా తాను పండించిన సన్నరకం ధాన్యాన్ని రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకునే అవకాశం దక్కినట్లు అయ్యిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో రైతు మిత్ర, జై శ్రీరామ్ అలాంటి ఒకటి, రెండు సన్నరకం వెరైటీలకు మాత్రమే ఆశించిన ధర లభించేదని మిగతా వాటికి సరైన ధర లభించకపోయేదని రైతులు ఆవేదన వ్యక్తం చేసేవారు. కాగా తాజా గా ప్రభుత్వం అందిస్తున్న ఈ బోనస్‌తో అన్ని వెరైటీల సన్న రకాలకు ఆశించిన ధర లభించినట్లవుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో తెలంగాణ రాష్ట్రంలో సన్న రకం వరి పంట సాగు మరింత పెరగనున్నట్లు అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

సన్న రకాలను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలి



● గెడం గోపాల్, సివిల్ సప్లయ్ డీఎం, నిర్మల్

నిర్మల్ జిల్లాలో పండించిన సన్న రకం ధాన్యాన్ని రైతులు వరి ధాన్యం కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వం అందించే బోనస్‌తో లబ్ధి పొందాలి. దళారులకు ధాన్యాన్ని విక్రయించి మోసపోవద్దు. చివరి రైతు వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం. ఎటువంటి ఆందోళన అక్కర్లేదు. సన్న రకం ధాన్యం విక్రయించిన రైతు ఖాతాల్లో ఎంఎస్‌పీ డబ్బులు జమ చేసిన 48 గంటల్లో బోనస్ డబ్బులు సైతం జమ అవుతాయి.

కస్బా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ దినోత్సవం

● ఆకట్టుకున్న క్యాడెట్ల విన్యాసాలు



ఎన్‌సీసీ క్యాడెట్లు

నిర్మల్ అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ పట్టణంలోని కస్బా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం 77వ ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్లు నిర్వహించిన విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నిర్మల్ ప్రధాన వీధుల గుండా ఎన్‌సీసీ దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్, ఫస్ట్ ఆఫీసర్ యాటకారి సాయన్న మాట్లాడుతూ భారత దేశ మొదటి అతిపెద్ద ప్రభుత్వ రంగ యువ సైనిక సైన్యంగా ఎన్‌సీసీ కొనసాగుతుందన్నారు. ఇప్పటికే ఎన్‌సీసీలో చేరి వందలాది మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించి దేశ రక్షణలో భాగంగా ఆర్మీ, నేవి, వాయు, సైనిక దళ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 24 పాఠశాలల్లో ఎన్‌సీసీ నడుస్తుందన్నారు. 3 జూనియర్ కాలేజీలు, 8 డిగ్రీ కళాశాలల్లో ఎన్‌సీసీ శిక్షణ నడుస్తుందన్నారు. ఎన్‌సీసీ శిక్షణ వల్ల నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ విద్యార్థులకు అలవడుతాయన్నారు. నేటి యువత చెడు విన్యాసాలకు లోను కాకుండా ఎన్‌సీసీలో చేరి సత్ప్రవర్తన, క్రమశిక్షణ, సోదర భావం, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు నేర్చుకుంటు న్నారన్నారు. ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు 10 రోజుల ప్రత్యేక శిక్షణ క్యాంపు ఉంటుంది. అందులో ఫిజికల్ ఫిట్నెస్, డ్రిల్లు, వెపన్ ట్రైనింగ్, ఎన్‌సీసీకి సంబంధించిన విషయ పరిజ్ఞానం, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులతో భాగస్వామ్యం అవుతారు. విద్యార్థులు ఎన్‌సీసీలో చేరి దేశ సేవకు అంకితం కావాలన్నారు. క్రమశిక్షణకు ఎన్‌సీసీ మారుపేరుగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మధుసూదన్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

జుమ్మేరాత్‌పేట్ బాలుర హైస్కూల్‌లో ..



డవ్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్స్ అందజేస్తున్న దృశ్యం

నిర్మల్ అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిర్మల్‌లోని జుమ్మేరాత్‌పేట్ బాలుర హైస్కూల్‌లో ఎన్‌సీసీ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ విద్యార్థులు నిర్వహించిన పరేడ్‌తో పాటు ఇతర సాంస్కృతిక, సాహసోపేత కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. పాఠశాల ఇంచార్జ్ హెడ్‌మాస్టర్ సర్వాడే దత్తురాంతో పాటు ఎన్‌సీసీ ఇంచార్జ్ మొలకల శ్రీనివాస్ తదితరలు ఈ కార్యక్రమాలను పర్య వేక్షించారు. అనంతరం విద్యార్థులు పట్టణ వీధుల గుండా సాగించిన పరేడ్ అందరినీ ఆకట్టుకుంది. పరేడ్ అనంతరం స్థానిక ప్రియదర్శిని నగర్‌లోని డవ్ వృద్ధాశ్రమంలో ఎన్‌సీసీ విద్యార్థులు, ఇంచార్జ్ శ్రీనివాస్, హెడ్‌మాస్టర్ దత్తురాం, తదితరులు వృద్ధులకు పండ్లు, బ్రెడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ ఇంచార్జ్ శ్రీనివాస్ మాట్లా డుతూ ఓవైపు చదువుత కొనసాగిస్తూనే ఎన్‌సీసీ విద్యార్థులు దేశ సేవలో పాలు పంచుకుంటున్నారని తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు విపత్తు సమ యాల్లో ఎన్‌సీసీ క్యాడెట్లు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు.

'ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి'

కుంటాల, నవంబర్, 24 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కుంటాల ఎస్సై భాస్కరాచారి అన్నారు. ఆదివారం కల్లూరు - కుంటాల రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్కరు రహదారి భద్రత నియమాలు పాటించాలని, హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు.

భక్తిశ్రద్ధలతో ఆయుత చండీయాగం

● పాల్గొన్న ప్రముఖులు ● నేటితో ముగింపు



పూజలో పాల్గొన్న ఇంద్రకరణ్ రెడ్డి దంపతులు



మంగళశాసనాలు అందిస్తున్న స్వామీజీ

నిర్మల్ కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న శ్రీవైష్ణవ అయుత చండీ యాగంలో ఆదివారం పలువురు పాల్గొన్నారు. యాగశాలలో జరిగే హోమం, పూజా కార్యక్రమాలు తిలకించారు. డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పాల్గొన్నారు. శనివారం జరిగిన యాగంలో మాజీ మంత్రి ఇంద్ర కరణ్‌రెడ్డి, పారిశ్రామిక వేత్త మురళీధర్‌రెడ్డి దంపతులు రుక్మిణి సత్యభామ సమేత కల్యాణంలో పాల్గొన్నారు. కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామివారికి మంగళశాసనాలు అందించారు. లోక కల్యాణార్థం నిర్వహించే 84వ విశ్వ శాంతి మహాయాగంలో ప్రజలు పాల్గొనాలని వారు కోరారు. కొరిపల్లి భూషణ్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి, పాకాల రాంచందర్, ఆమెడ శ్రీధర్, వేణుగోపాల్ రెడ్డి, పీచర రమణారెడ్డి పాల్గొన్నారు. రమణారెడ్డి ప్రతీ రోజు నిర్వహించే యాగానికి 150 లీటర్ల పాలను ఉచితంగా అందజేశారు. నేటితో యాగం ముగియనుంది.

అఖిల భారతీయ సర్వీసుల ట్రైనీ ఆఫీసర్ల బృందం రాక



ట్రైనీ అధికారుల బృందాన్ని సత్కరించిన న్యూ లోలం గ్రామస్థులు

దిలావర్‌పూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయి శిక్షణలో భాగంగా ఆదివారం అఖిల భారతీయ సర్వీసుల శిక్షణ బృందం అధికారులు మండలంలోని న్యూ లోలంలో పర్యటించారు. ఈ సందర్భంగా న్యూ లోలం గ్రామస్థులు ట్రైనీ ఆఫీసర్ల బృందానికి ఘనంగా స్వాగతం పలికారు. శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం ట్రైనీ అధికారులు గ్రామం లోని స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమయ్యారు. స్వయం సహాయక సంఘాల ఏర్పాటు ఉద్దేశం, ప్రయోజనాలు తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. మహిళల స్వయం ఉపాధి పొందేందుకు సంఘాలు ఎంతో ఉపయోగ పడుతున్నాయని మహిళలు వారికి వివరించారు. ఆర్థిక స్వయం స్వావలంబనకు ఉపయోగపడుతున్నాయన్నారు. అనంతరం మాడెగాంలోని మిషన్ భగీరథ ప్లాంట్‌ను సందర్శించారు. వీరి వెంట ఎంపీడీవో అరుణ రాణి, ఎంపీవో గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శులు శ్రావణ్, సునీల్, ఈజీఎస్ ఏపీవో దివ్య రెడ్డి, ఐకేపీ ఏపీఎం సులోచన రెడ్డి, తదితరులు ఉన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలి

● ఎన్నికల అధికారి ప్రేమేందర్ రెడ్డి



మాట్లాడుతున్న ప్రేమేందర్ రెడ్డి

నిర్మల్ కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని నిర్మల్ జిల్లా ఎన్నికల అధికారి జి.ప్రేమేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా అధ్యక్షుడు కే. అంజు కుమార్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ సంఘటన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రేమేందర్ రెడ్డి దేశ వ్యాప్తంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం పూర్తవుతోందన్నారు. బూత్ స్థాయిలో అధ్యక్షుల ఎన్నిక ఆనవాయితీగా వస్తోందన్నారు. త్వరలో మండల, రాష్ట్ర ఎన్నికలు జరుగుతాయని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని బూత్‌లలో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్న గారి భూమయ్య, రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్, ఎన్నికల కో రిటర్నింగ్ అధికారి సామ రాజేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మే డిసెమ్మె రాజు, గంగాధర్, రవి పాండే, సత్యనారాయణ గౌడ్, మల్లికార్జున్‌రెడ్డి, నారాయణరెడ్డి, రితీష్ రాథోడ్, సుష్మ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం పరిశీలన

● సర్వే వివరాలు తప్పులు లేకుండా డాటా ఎంట్రీ చేయాలి
● కేజీబీవీ పాఠశాల, ఓటరు నమోదు కేంద్రం పరిశీలన



వరి కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

ముథోల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విట్టోలి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం జిల్లా అడిషనల్ కలెక్టర్ కిషోర్ బాబు పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. వరి కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యాన్ని రైతుల నుంచి తీసుకున్న 24 గంటల్లో రైతుల ఖాతా ల్లో డబ్బులు జమ అవుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా సూచనలు ఇచ్చారు. అలా గే తహసీల్దార్ కార్యాలయంలో సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ సందర్శించి పలు వివరాలను తహసీల్దార్ శ్రీకాంత్‌కు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి తప్పులు లేకుండా సర్వే వివరాలను పకడ్బందీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం అక్కడి నుంచి ముథోల్‌లోని కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. అనంతరం మండలంలోని తరోడా గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలించి బీఎల్‌వోలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ సందర్భంగా సూచనలు ఇచ్చారు.

సజావుగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష



భైంసా పరీక్షా కేంద్రంలో తనిఖీలు చేపడుతున్న ఎంఈవో సుభాష్

భైంసా, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని రెండు కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్ష సజావుగా కొనసాగింది. సర్కారు పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతియేటా ఎన్ఎంఎంఎస్ పరీక్షను నిర్వహిస్తోంది. ప్రతిభ ఆధారంగా సంబంధిత పరీక్ష ద్వారా ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు ఒక్కో విద్యార్థికి రూ.48 వేలను కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. ఎంపికైన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వరకు ఉపకార వేతనాలు అందనున్నాయి. భైంసాలో సంబంధిత పరీక్ష నిర్వహణ కోసం గాను ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని కేంద్రంలో 172 మంది విద్యార్థులకు 170 మంది విద్యార్థులు, ఉర్దూ మీడియం బాలికల ఉన్నత పాఠశాలలోని కేంద్రంలో 177 మంది విద్యార్థులకు 174 మంది విద్యార్థులు హాజరయ్యారు. భైంసా మండల విద్యాధికారి సుభాష్ రెండు పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు చేపట్టి పరీక్ష వ్యవస్థను పర్యవేక్షించారు.

గజ్జలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తజనం



గజ్జలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల, నవంబర్, 24 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల స్థానిక గజ్జలమ్మ ఆలయానికి ఆదివారం భక్తజనం పోటెత్తింది మండలం నలుమూలల నుంచే కాకుండా పక్క మండలాల నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గజ్జలమ్మకు ప్రీతిపాత్రమైన నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఎమ్మెల్యే తీరు సరికాదు : కాంగ్రెస్

● నాయకులు గిమ్మసంతోష్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న గిమ్మసంతోష్‌రావ్

ఆదిలాబాద్‌అర్బన్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలలో కనీసం ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కపేరు తీసుకోకపోవడం బాధాకరమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గిమ్మసంతోష్‌రావ్ ఆరోపించారు. ఆదివారం కంది‌శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే తీరుపై ఆయన మండిపడ్డారు. సోమ్ము ఒకరిది.. సోకు ఒకరిదనే విధంగా బీజేపీ ఎమ్మెల్యే పాయలశంకర్ వ్యవహారం ఉందన్నారు. జైనథ్ మండల కేంద్రంలో మినీ స్టేడియంతో పాటు ఆకుర్ల నుంచి రూ.90 లక్షలతో చేపట్టబోయే రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారన్నారు. ఇవి రాష్ట్ర ప్రభుత్వ నిధులన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో భూమిపూజలు చేస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, కాని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వివిధ గ్రాంట్‌ల కింద మంజూరైన నిధులతో భూమిపూజలు చేయడం మానుకోవాలన్నారు. ప్రొటోకాల్ ప్రకారం అందుకు అర్హత ఉన్నప్పటికీ తమ అదినాయకుల పేర్లు తీసుకుని శంఖుస్థాపనలు చేయాలన్నారు. సమావేశంలో జైనథ్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అల్లూరి అశోక్‌రెడ్డి, గడ్డం జగదీశ్‌రెడ్డి, జైనథ్ ఆలయ ఛైర్మన్ అడ్డిరూకేష్‌రెడ్డి, బత్తుల‌శ్రీనివాస్, మునిగెల విఠల్, చిత్రుపటేల్ తదితరులున్నారు.

కవికి పరామర్శ



పరామర్శిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే‌బ్రహ్మానంద్

నేరడిగొండ, నవంబరు24 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖకవి, రచయిత అయిన డా.గంగారాం కుర్మే కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకుని ఆదివారం నేరడిగొండ మండల కేంద్రంలోని ఆయన స్వగృహంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పతంగే‌బ్రహ్మానంద్ పరామర్శించారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు సాబ్లెసంతోష్‌సింగ్, నాయకులు రాములు, నారాయణ, పరశురాం, ప్రవీణ్, భీంరావ్, అమృత్, భరత్ తదితరులున్నారు.

కబడ్డీ టోర్నమెంట్‌కు హాజరు కావాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న యువకులు

నేరడిగొండ, నవంబరు24 (ఆంధ్రజ్యోతి) నేరడిగొండ మండలంలోని వడూర్ గ్రామంలో ఈ నెల 28వ తేదీన ప్రారంభమయ్యే వడూర్యపురం కబడ్డీ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరు కావాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను ఆహ్వాన పత్రికను అందజేసిన వడూర్ గ్రామ యువకులు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించి తప్పకుండా హాజరవుతారని ఎమ్మెల్యే తెలిపారు.

గ్రామాభివృద్ధిలో అందరూ భాగస్వాములవ్వాలి

ఇచ్చోడ, నవంబరు, 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధిలో అందరూ భాగస్వాములవ్వాలని ఇచ్చోడ గ్రామ ప్రజలు పిలుపునిచ్చారు. డిసెంబరు 5వ తేదీన వీడీసీ కమిటీ సమావేశం నిర్వ హించనున్నామని ప్రతిసామాజిక వర్గం నుంచి ఇద్దరి చొప్పున ఎంపిక చేసి కార్యవర్గాన్ని ఎన్ను కోనున్నట్లు వారు చర్చించారు. ఈ సంద ర్భంగా గ్రామస్థులు పలువురు మాట్లాడుతూ.. డిసెంబరు 5న గ్రామకమిటీని ఎన్నుకుంటు న్నామన్నారు.

కూలీ కుటుంబం నుంచి ఉన్నత స్థాయి ఉద్యోగం



బొడకుంట గణేష్

ఆదిలాబాద్‌అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఒక మాములు కూలీ పని చేసే కుటుంబం నుంచి వచ్చిన గణేష్ గెజిటెడ్ స్థాయి ఉద్యోగానికి ఎంపిక అవ డంతో పలువురు ఆయనను అభినందిస్తున్నారు. జిల్లా కేంద్రంకు చెందిన బోడకుంటావర్ గణేష్ వ్యవసాయ కుటుంబంలో జన్మించాడు. తల్లి ఆశమ్మ చిన్నప్పుడే అనారోగ్యంతో మృతిచెందింది. తండ్రి సాంభశివ్ ప్రోద్భలంతో ఉన్నత స్థాయికి ఎదిగాడు. 2019లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠ శాలలో టీజీటీ ఇంగ్లీష్ ఉద్యోగం సంపాదించాడు. అదే సమయంలో తనకు జరి గిన యాక్సిడెంట్‌లో కాలుని కోల్పోయాడు. కాని పట్టువదలక చదివి ఈఎఫ్ఎల్‌యూ యూనివర్సిటీలో పీహెచ్‌డీ సీటు సాధించి ఇంగ్లీష్ పై పీహెచ్‌డీ చేస్తున్నాడు. కాగా ఇటీవల టీజీపీఎస్‌సీ ప్రకటించిన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో జేఎల్ ఇంగ్లీష్‌కు ఎంపికయ్యాడు. అదే విధంగా గ్రూప్ -1వి జయంతంగా మెయిన్స్ రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్నట్లు ఆయన తెలిపారు.

సర్వే సమాచారాన్ని పోర్టల్‌లో నమోదు చేయడం కీలకం

ఆసిఫాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయడం కీలకమైన అంశం అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం జార్ఖండ్ రాజధాని రాంచి ఉంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్నిజిల్లాల కలెక్టర్‌లు, అదనపుకలెక్టర్‌లు, అధికా రులతో సమగ్ర ఇంటింటి సర్వేపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే డేటా ఎంట్రీ చాలా కీలకమైందని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వం ఈ అంశం దృష్టి కేంద్రీకరించిందని తెలి పారు. సర్వేదశలో పట్టణ ప్రాంతాల్లో డోర్‌లాక్, ఇంటి వద్ద అందుబాటు లో లేకపోవడం జరిగి నట్లయితే సంబంధిత కుటుంబ సభ్యులకు ఫోన్‌కాల్ చేసి సర్వే గురించి తెలియజేసి వివరాలను సేకరించాలని తెలిపారు. గ్రామీణప్రాంతాల్లో వలసలు మొదలైన వారి వివరాలను జాగ్రత్తగా క్రమబద్ధీకరించుకోవాలని తెలిపారు. ఈ వీసీలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

కౌటాల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన హమ్‌రాజ్ ఈనెల 25 నుంచి 28వరకులక్నోలో జరిగే జాతీయస్థాయి అథ్లె టిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల హను మకొండ జేఎన్ఎస్‌గ్రౌండ్‌లో నిర్వహించిన నేషనల్‌మీట్‌లో ప్రతిభకబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కాగా హమ్‌రాజ్ రుక్మాపూర్ సైనిక్‌స్కూల్‌లో 9వతరగతి చదువు తున్నాడు. ఈసందర్భంగా హమ్‌రాజ్‌ను పలువురు అభినందించారు.

యంత్రాల కొరత... పంట పొలాల్లోనే ధాన్యం

● కూలీలు దొరకక ఇబ్బందులు

● ఆందోళనలో అన్నదాతలు



యంత్రాలు దొరకక పంట పొలాల్లోనే ఉన్న వరి ధాన్యం

సారంగాపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యం చేతికి వచ్చిన పంటను పంట పొలాల్లో నుంచి తీయడానికి యంత్రాల కొరతతో పాటు కూలీల కొరత ఉండడంతో పంట పొలాల్లోనే వరి ధాన్యం ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొం టున్నారు. వరి ధాన్యం చేతికి వచ్చిన కోత యంత్రాలు లేకపోవడంతో పెట్టినటువంటి పెట్టుబడి కూడా రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు చేతికి వచ్చిన పంటను అడవి జంతువులు ధ్వంసం చేయడంతో చేతికి వచ్చిన పంటను కాపాడుకోవడానికి రాత్రి సమయంలో పంట పొలాల్లోకి వెళ్లి ధాన్యాన్ని కాపాడుకోవడానికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని రైతులు పేర్కొంటున్నారు. ప్రతి ఏడాది వరి యంత్రాలను ఇతర ప్రాంతాల నుంచి తెచ్చి పంట పొలాల్లో ఉన్నటువంటి వరి ధాన్యాన్ని తీసి వేయడంలో ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కోలేమని, ప్రస్తుతం వరి పంట అధికంగా ఉండడం వల్ల యంత్రాల కొరత ఉందని దీంతో చేతికి వచ్చిన పంట పంట పొలాల్లోనే ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళనలో రైతులు...

యంత్రాల కొరతతో పాటు కూలీల కొరత ఉండడం వల్ల వరి కోతను కోసే యంత్రాల రేటు గంటకు రూ. 2,000ల నుండి 2,500ల వరకు యంత్రాలు యజమానులు తీసుకోవడంతో పాటు పంట పొలాల్లో పని చేసే కూలీలు అధికంగా రోజు కూలీలు ఇవ్వాలని డిమాండ్ చేయడం వల్ల ఆందోళనకు గురవుతున్నామని రైతులు పేర్కొంటున్నారు.

కూలీలు దొరక ఇబ్బందులు...

మహారాష్ట్రలోని ఇతర ప్రాంతాల నుండి ప్రతి రోజు సారంగాపూర్ మండలంలో గల ఆయా గ్రామాల్లో పంట పొలాల్లో పని చేసేటటువంటి రైతు కూలీలు ఇటువైపు రాకపోవడంతో పంట పొలాల్లోనే వరి ధాన్యం ఉందని, ఈ ఏడాది అధికంగా వరి పంటను వేయడంతో యంత్రాల కొరతతో పాటు కూలీల కొరత తీవ్రంగా ఏర్పడిందన్నారు.

యంత్రాలు లేక పొలాల్లోనే వరి పంట...

- లక్ష్మణ్, రైతు



ఈ సంవత్సరం వరి పంట ఆశాజనకంగా ఉందని, వరి కోసేందుకు వరి కోత యంత్రాలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బం దులు తప్పడం లేదు. గత సంవత్సరం వరి పంట కోతకు వచ్చే ముందు నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాల నుంచి వరి కోత యంత్రాలు వచ్చి రైతులకు అందుబాటులో ఉండేవని ఈ ఏడాది వరి అధికంగా ఉండడం వల్ల యంత్రాల కొరత ఉంది. దీంతో వరి ధాన్యం పంట పొలాల్లోనే ఉంది.

మాలల సింహ గర్జన సభను విజయవంతం చేయండి

ఇంద్రవెల్లి, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): మాలల సింహ గర్జన సభను విజయవంతం చేయాలని జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు కొప్పల రమేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ భవన ఆవరణలో సభ కు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. ముందుగా అంబేద్కర్ భవనం లోని అంబేద్కర్ చిత్ర పటానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలోమాలలకు అన్యా యం జరుగకుండా అందరం సంఘటితం కావాల్సిన సమయం ఆసన్నమైందని, మాలలకు తీవ్ర అన్యాయం జరిగే అవ కాశం ఉందని, అన్యాయం జరగక ముందే అప్రమత్తంగా ఉండి హక్కుల కోసం పోరాడాలని సూచించారు. డిసెంబర్ 1వ తేదిన హైదరాబాద్‌లో జరిగే మాలల సింహ గర్జన సభను విజయవంతం చేయాలని మాలల ఆత్మ గౌరవం కోసం తమ ఉనికి కోసం పోరాడాల్సిన సమయం వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి రాజేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షులు కాటం రమేష్, మాల మహానాడు మండల అధ్యక్షుడు రాజేశ్వర్, సోన్ కాంబ్లే మనోహర్, ప్రధాన కార్యదర్శి వాగ్మారే కామరాజ్ ఉన్నారు.

భక్తి భావంతో మెదలాలి



సప్తాహంలో పాల్గొన్న ఎమ్మెల్యే పవార్ రామరావుపాటిల్

కుబీర్, నవంబరు(ఆంధ్రజ్యోతి) 24 : తాళసప్తమి వేడుకలతో గ్రామాల్లో ఐక్యత భావం పెంపొందుతుందని ఎమ్మెల్యే పవార్ రామరావుపాటిల్ అన్నారు. ఆదివారం కుబీర్ మండల కేంద్రంలోని విఠల్యేశ్వరాలయంలో నిర్వహించిన తాళ సప్తమి వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. భక్తి భావంతోనే ఐక్యత భావం పెంపొందుతుందని, కుబీర్ వాసులంతా వ్రావిఠలేశ్వరాలయంలో ఘనంగా వేడుకలను నిర్వహించడం సంతోషకరమన్నారు. రెండవ పండరి పురంగా ప్రసిద్ధికెక్కుతున్న విఠలేశ్వర ఆలయ అభివృద్ధికి తన వంతుగా పాటుపడతానన్నారు. అనంతరం తాళ సప్తమి వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే వీణాధారణ చేసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సత్కరించారు. ఆయన వెంట స్థానిక నాయకులు బోయిడి విఠల్, గులాబ్‌నాయక్, ఉప్పు దత్తు, వైద్యనాథ్, ప్యాట లక్ష్మణ్, పుప్పాల లింగం, నాగేందర్, ఆలయ కమిటీ అధ్యక్షులు పెంటాజీఉన్నారు.

డేటా ఎంట్రీ పకడ్బందీగా చేపట్టాలి: డీఆర్వో



డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న డీఆర్వో లోకేశ్వరరావు

వాంకిడి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డాటాఎంట్రీని పకడ్బందీగా చేపట్టాలని డీఆర్వో లోకేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం మండలపరిషత్ కార్యాలయంలో జరుగుతున్న ఆన్ లైన్ డాటాఎంట్రీని పరిశీలించారు. డాటా ఎంట్రీ సమయంలో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్ర త్తగా వ్యవహరించాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలను ఎప్పటికప్పుడు రోజువారీగా కలెక్టర్ కార్యాలయానికి పంపించాలని ఆపరేటర్లకు సూచించారు. అనంతరం మండలంలోని పలు పోలింగ్‌బూత్‌లను సందర్శించి ఓటరు నమోదును పరిశీ లించారు. అనంతరం గ్రంథాలయాన్ని సందర్శించి పుస్త కాల వివరాలు తెలుసుకున్నారు. గ్రంథాలయంలో ఉద్యో గాలకోసం సన్నద్ధవుతున్న యువకులతో మాట్లాడి అందుబాటులో ఉన్నపుస్తకాలతో చదువుకుంటూ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని అన్నారు. ఆయనవెంట ఎంపీ డీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ రియాజ్ అలీ, గిర్దావర్ మాజీద్, ఎంపీవో అజీజుద్దీన్ తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

ఆసిఫాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు 8వతరగతి నుంచి ఇంటర్మీడి యట్ వరకు అయిదు సంవత్సరాలు కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్ ఇవ్వడానికి నిర్వహించే నేషనల్ మీన్స్‌కం మెరిట్‌స్కాలర్‌షిప్ పరీక్ష జిల్లాకేంద్రంలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మొత్తం 483మంది విద్యార్థులకుగాను 431మంది విద్యార్థులు హాజరైనట్లు పరీక్షల సహాయసంచాలకుడు ఉదయ్‌బాబు తెలి పారు. పరీక్షాకేంద్రాల వద్ద సీఐ రవీందర్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

భక్తులతో కిటకిటలాడిన
జైనథ్ లక్ష్మీనారాయణ స్వామి ఆలయం



వెలసిన దుకాణాలు



చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన దుకాణం

జైనథ్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి):ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి 18కి.మీ దూరంలో ఉన్న జైనథ్ మండల కేంద్రంలో గల శ్రీలక్ష్మీనారాయణ స్వామి జాతర ఆదివారంతో నాల్గో రోజుకు చేరుకుంది.ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రంలోని నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్ జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్ర మైన మహారాష్ట్ర నుంచి వేలాది మంది మహిళలు భక్తులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సం దర్భంగా స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. జాతరలో వెల సిన వివిధ దుకాణాలలో వివిధ వస్తువులను భక్తులు కొనుగోలు చేశారు. భక్తుల రద్దీతో జైనథ్ లక్ష్మీనారాయణ స్వామి ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా జైనథ్ మండల ఎస్సై వి.పురుషోత్తం ఆధ్వర్యంలో పోలీసు బందో బస్తును నిర్వహించారు. ఈ జాతరను ఆలయ ఈఓ వామన్‌రావ్, ఛైర్మన్ రుకేష్‌రెడ్డి సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

బాధితుడికి ఖానాపూర్ ఎమ్మెల్యే పరామర్శ



బండు పటేల్‌ని పరామర్శిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే

సిరికొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పాముకాటుకు గురైన సిరికొండ మండలంలోని రాజంపేట్ గ్రామానికి చెందిన బండు పటేల్‌ను ఆదివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి మెరుగైన వైద్యాన్ని అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట రిమ్మ మాజీసర్పంచ్ అనిల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన నాయకులు



ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

సిరికొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సిరికొండ మండలంలోని కుంటగూడ గ్రామపంచాయతీ మాజీసర్పంచ్ మడావి గంగాధర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ని నేరడిగొండలోని తన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గంగాధర్ మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల వాయిపేట్ గ్రామం నుంచి తమ గ్రామానికి వెళ్ళే రోడ్డు అధ్వానంగా మారి రాకపోకలకు ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులకు గురికా వడంతో గమనించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రూ.5 లక్షల నిధులతో గ్రావెల్ రోడ్డు మంజూరు చేసి, పూర్తి చేసినందుకు గ్రామ స్తుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఒరగంటి పెంటన్న, మాజీ కో-ఆప్షన్ మెంబర్ ఎండీ ఎక్బాల్, కుంటగూడ, పాలవాగు గ్రామస్తులు ఉన్నారు.

పోస్టర్లు విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న నిర్వాహకులు

ఉట్నూర్, నవంబర24 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ దివంగత ఐఏఎస్ అధికారి మడావి తుకారం వర్ధంతి పోస్టర్లను నిర్వహణ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో తుకారం వర్ధంతి పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. తుకారం వర్ధంతి పురస్కరించుకొని ఈ నెల 26 నుంచి తుకారం స్మారక వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.మొదటి బహుమతి రూ.10001, ద్వితీయ బహుమతి రూ.7001, తృతీయ బహుమతి రూ.3001, బెస్ట్ ప్లేయర్ బహుమతి రూ.1001 ఇవ్వడం జరుగుతుందని ఆసక్తి గల వారు ఎంట్రీ ఫీజు రూ.301,పిట్ల రాజేశ్, ఫిజికల్ డైరెక్టర్, 7981167003 కోట్నాక్ జలపత్ ఫిజికల్ డైరెక్టర్ 8500448825లకు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని మడావి తుకారం యూత్ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో కోట్నాక్ ఉమేష్, తొడసం జనార్ధన్, ఆత్రం మారుతి, ఆర్క ఓమేశ్వర్, ఆర్కగంగారాం, మేస్రం రాజు, సెద్మకి భగవంతురావు, తొడసం కృష్ణలు పాల్గొన్నారు.

నూతన పోలింగ్ బూత్ కమిటీలను ఎన్నుకోవాలి



మాట్లాడుతున్న పతంగే బ్రహ్మానంద్

నేరడిగొండ, నవంబరు24(ఆంధ్రజ్యోతి): బీజేపీ నూతన పోలింగ్ బూత్ కమిటీలను ఎన్నుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. ఆదివారం నేరడిగొండ మండలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలని అందుకు అనుగుణంగా పోలింగ్ బూత్ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపుకై సంస్థాగతంగా పటిష్టపరిచే బాధ్యతను పార్టీ నాయకులు తీసుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు సాబ్లెసంతోష్‌సింగ్, నాయకులు రాజశస్త్రఖర్, రాములు, నారాయణ, పరశురాం, శ్రీను, లక్ష్మణ్, ప్రవీణ్, శ్రీధర్‌రెడ్డి, ప్రకాష్, నవీన్, ఉత్తం, జమీర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ గోదాంలో షార్ట్ సర్క్యూట్

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్‌లోని భుక్తాపూర్ 33 కేవీ సబ్‌స్టేషన్ ప్రాంగణంలోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు గోడౌన్ (జేపీఈ సెంటర్)లో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో గోదాం మొత్తం పొగతో కమ్ముకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశారు. సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

వివాహిత అదృశ్యం

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షిద్‌నగర్‌కు చెందిన (34) వివాహిత అదృశ్యమైనట్లు టూ టౌన్ ఎస్సై కె.విష్ణు ప్రకాష్ తెలిపారు. శనివా రం ఉదయం భార్య భర్తలు గొడవ పడ్డారు. దీంతో మహారాష్ట్రలోని తల్లి ఇంటికి వెళ్తున్నానని పిల్లలకు చెప్పి వెళ్లిపోయింది. ఆదివారం భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి యథాతథంగా ప్రజావాణి : కలెక్టర్

నిర్మల్ కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తిరిగి యథాతథంగా సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించే కార్యక్రమాన్ని అర్జీదారులు విని యోగించుకోవాలని సూచించారు.

శిథిలావస్థలో సొసైటీ భవనాలు

● భైంసా డివిజన్ పరిధిలో పలు గ్రామాల్లో నిరుపయోగంగా మారిన సహకార సంఘ భవనాలు ● అరకొర వసతులతో అద్దె భవనాల్లో నిర్వహణ ● పాట్లు పడుతున్న సంబంధిత అధికారులు, సిబ్బంది


● భైంసా మండలం దేగాంలో శిథిలావస్థకు చేరుకున్న సహకార సంఘ భవనం

ఆంధ్రజ్యోతి పరిశీలన

భైంసా, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నిర్వహణ అధికారులు అవలంబించిన అలసత్వ విధానాలకు పాలకవర్గాల బాధ్యతారాహిత్య చర్యలు తోడవ్వడం మూలంగా లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన సహకార సంఘ కార్యాలయాలు నిరుపయోగంగా మారాయి. ఏళ్ల తరబడి వాటిని వినియోగించుకోక పోవడం మూలంగా... ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరుకుని పనికిరాకుండా పోయే స్థితికి చేరుకున్నాయి.

భైంసా డివిజన్ పరిధిలోని మాలేగాం, సుంక్లి, దేగాం, కల్లూర్, జౌళ గ్రామాల్లో రూ. 8లక్షలను వెచ్చించి సహకార సంఘ భవనాలను నిర్మించారు. ఒక్కో భవనంలో సహకార సంఘ చైర్మన్, నిర్వహణ అధికారులకు ఒక్కో గదిని, సమావేశపు మందిరాన్ని, ఎరువులు తదితర వాటిని నిల్వగా ఉంచేందుకు గోడౌన్‌లను కలిపి కార్యాలయాలను నిర్మించారు. అంతేకాకుండా ప్రారంభంలో వీటి నిర్వహణ సజావుగానే సాగిందంటున్నారు. అయితే తదనంతర కాలంలో చోటు చేసుకున్న మార్పుల మూలంగా వీటి వినియోగాన్ని అధికారులు విస్మరించారు. మండల, పట్టణ కేంద్రాల్లో అద్దె గదులను తీసుకుని సహకార సంఘ కార్యాలయ నిర్వాహణ ప్రక్రియలను నిర్వహించేందుకు మక్కువ చూపారు. దీనికి తోడు ప్రభుత్వం ఒక్కో మండలంలో రెండు నుండి నాలుగు వరకు గల సహకార సంఘాలను కుదించి మండలానికి ఒక సంఘానికి మాత్రమే పరిమితం చేసింది. అంతేకాకుండా నియమ, నిబంధనలకు అనుకూలంగా ఎన్నికలు నిర్వహించక పోవడం, ఇన్‌చార్జీలు బాధ్యతగా వ్యవహరించక పోవడం లాంటి కారణాల మూలంగా లక్షలాది రూపాయలు వెచ్చించిన సహకార సంఘం కార్యాలయ భవనాలు నిరుపయోగంగా మారాయి. ఏళ్ల తరబడి వాటిని వినియోగించక పోవడం మూలంగా ప్రస్తుతం భవనాల పరిస్థితి శిథిలావస్థకు చేరుకున్నాయి. అదేవిధంగా గ్రామాల్లో గల సంఘ భవనాలను కొద్ది మంది ఆక్రమించుకుని అందులో తమ సరుకులను ఉంచుకుంటుండగా.. గ్రామానికి బయట గల భవనాలు దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి అంటున్నారు.


● అద్దె భవనంలో కొనసాగుతున్న మిర్జాపూర్ సహకార సంఘం

కుంటాల మండలంలోని కల్లూర్ సహకార సంఘ భవనం పగుళ్లు తేలి పతనావస్థకు చేరుకుంది. సుంక్లి సహకార సంఘ భవనంలో నిరూపయోగంగా ఉంటుండటంతో యాచకులు అందులో తిష్టవేశారు. దేగాం సహకార సంఘ భవనం పూర్తిస్థాయిలో దెబ్బతిని ఎందుకు పనికి రాకుండా పోయింది. మాలేగాం భవనం పలువురు రైతులు తమ పనిముట్లు పెట్టుకోవడానికి,పశువులను కట్టివేయడానికి వినియోగిస్తున్నారు. ప్రస్తుతం సహకార సంఘ కార్యకలాపాలు అరకొర వసతులతో ఉన్న అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. భైంసా డివిజన్ పరిధిలోని బిద్రెల్లి సహకార సంఘం మండలకేంద్రమైన ముథోల్‌లోని సొంత భవనంలో, కుభీర్ సహకార భవనం సొంత భవనాల్లో కొనసాగుతుండగా.. మిగితావన్నీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఇందులో వసతుల లేమితో పాటు సౌకర్యాలు కరువవ్వడంతో ఇటు నిర్వాహణ అధికారులు అటు సభ్యులు పాట్లు పడుతున్నారు. అధికార గణం శిథిలావస్థకు చేరుకున్న సహకార సంఘ భవనాలను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపడితే ప్రయోజనకరంగా ఉంటుందని సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులు నిర్వహించి వినియోగంలోకి తీసుకురావాలి

: కోర్వ శ్రీకాంత్, బీజేపీ ప్రతినిధి, భైంసా



భైంసా డివిజన్ పరిధిలో నిరూపయోగంగా మారిన, శిథిలావస్థ దశకు చేరుకున్న సహకార సంఘాల భవనాలకు అవసరమైన మరమ్మత్తులు నిర్వహించి వినియోగంలోకి తీసుకవచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. తద్వారా అద్దె భారం తగ్గడమే నిర్వాహణ వ్యవస్థ పూర్తిస్థాయిలో మెరుగవుతుంది. అధికారుల అవస్థలు తప్పుతాయి.

ఆంధ్రజ్యోతి ఫోకస్

సర్కారు దవాఖాన నిర్మాణం పూర్తయ్యేదెప్పుడు?!

● మధ్యలోనే నిలిచిపోయిన ఆసుపత్రి నిర్మాణ పనులు
● పట్టించుకోని పాలకులు, అధికారులు


పిల్లర్ల మధ్యలోనే నిలిచిపోయిన ఆసుపత్రి నిర్మాణం పనులు

ముథోల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని ప్రస్తుతం ఉన్న 30 పడకల ఆసుపత్రి భవనం శిథిలావస్థలో ఉండటంతో గతంలో గత ప్రభుత్వం నూతన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. పనులను సైతం ప్రారంభించి, పిల్లర్ల వరకే నిలిచిపోయింది. భవన నిర్మాణ పనులు పూర్తయితే సకల సౌకర్యాలతో నియోజకవర్గ కేంద్రం ముథోల్‌తో పాటు బాసర, తానూర్, లోకేశ్వరం మండలాల నుంచి వచ్చే రోగులకు సైతం వైద్య సేవలు అందుతాయన్న గంపెడు ఆశతో ఉన్న ప్రజలకు నిరాశే మిగిల్చింది. నూతన ఆసుపత్రి భవన నిర్మాణం కోసం ముథోల్‌లోని జాతీయ రహదారి భైంసా-బాసర ప్రక్కన ఆసుపత్రి నిర్మాణ పనులను గతంలో ప్రారంభించారు. ఈ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను మొదట్లో చురుకుగా కొనసాగించి పిల్లర్ల దశకు రావడంతో పనులను మధ్యలో నిలిపి వేశారు. గత ప్రభుత్వం నిర్మాణ బిల్లులు చెల్లించకపోవడంతోనే సదరు కాంట్రాక్టర్ పనులను ఆదిలోనే వదిలి పెట్టారు. అయితే సుమారు సంవత్సరంన్నర దాటిన నియోజకవర్గం పాలకులు పట్టించుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. దీంతో పాత ఆసుపత్రిలో కేవలం నామ మాత్రం వైద్య సేవలు అందుతున్నాయి. వైద్యులు ఉన్నప్పటికీ ఆసుపత్రిలో సకల సౌకర్యాలు లేకపోవడంతో శస్త్ర చికిత్సలు జరగటం లేదు. పలుమార్లు ముథోల్ నాయకులు, వివిధ యువజన సంఘం సభ్యులు, గ్రామస్థులు ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని ఆందోళన చేసినప్పటికీ.. పాలకులు మాత్రం స్పందించడం లేదన్న వాదనలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దీంతో వైద్యం అందని ద్రాక్షగా మారింది.

● కాంగ్రెస్ ప్రభుత్వంపైనే స్థానికుల ఆశలు!!

కాంగ్రెస్ ప్రభుత్వమైనా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆసుపత్రి నిర్మాణ పనులు వేగంగా జరుగతాయని ఆశపడ్డ స్థానికులకు మాత్రం నిరాశే ఎదురవుతుంది. ఆసుపత్రి నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని బీజేపీ నాయకులు, స్థానిక పలువురు నాయకులు పత్రికా ముఖంగా కోరినప్పటికీ పాలకుల స్పందన మాత్రం కరువైందని పలువురు అంటున్నారు. ప్రతీ ఎన్నికల్లో ముథోల్ అభివృద్ధికి కట్టుబడి ఉంటామంటూ పాలకులు ప్రగల్బాలు పలికినా.. పనులు ఎందుకు ముందుకు సాగడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వంపై పాలకుల ఒత్తిడి సరైన రీతిలో లేకపోవడం వల్లే ఆసుపత్రి నిర్మాణ పనులు ఆగిపోయాయని పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత నాయకులు, ఒత్తిడి సక్రమంగా లేకపోవడం వల్లే ఆసుపత్రి నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రి నిర్మాణ పనులను వెంటనే చేపట్టే విధంగా చూడాలని స్థానికులు విన్నవించినా.. నిర్మాణం పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. ముథోల్ మండల ప్రజలు మెరుగైన వైద్యం కోసం భైంసా, నిజామాబాద్, మహారాష్ట్రకు కోసం వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని, దీంతో ఆర్థికంగా నష్టపోతున్నామని పేదలు అంటున్నారు. ప్రజలు ఓటు వేసి గెలిపించిన నాయకులు గద్దెనెక్కిన తర్వాత సమస్యలను గాలికి వదిలేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఆసుపత్రి శిథిలావస్థకు చేరువేల ఉంది. ఒకప్పుడు ఈ ఆసుపత్రి రోగులతో కిటకిటలాడేది. ప్రస్తుతం ఔట్ పేషెంట్‌కే పరిమితం కావడం బాధాకరం. ప్రస్తుతం వైద్యులు, నర్సింగ్ స్టాఫ్ సంఖ్యను పెంచడంతో రోజుకు 200 వరకు రోగులు వస్తున్నారు. కానీ శస్త్ర చికిత్సలు జరగడం లేదు. ఎక్స్‌రే మిషన్, తదితర సౌకర్యాలు లేవు. నూతన భవనం పూర్తి చేసినట్లయితే అన్ని సదుపాయాలు రోగులకు అందుతాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, ప్రభుత్వం స్పందించి ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తిచేసి మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

బోనమెత్తిన కుచలాపూర్

● ఘనంగా అడెల్లి పోచమ్మ ఆలయ వార్షికోత్సవం ● పోతురాజుల విన్యాసాలు.. శివసత్తుల పూనకాలు
● భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం ● సంప్రదాయాలను భావితరాలకు అందించాలి : బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

భక్తి


పూజలు అందుకుంటున్న అడెల్లి పోచమ్మ అమ్మవారు

తలమడుగు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం కుచలాపూర్ గ్రామంలో ఆదివారం అడెల్లి పోచమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని భక్తులు, గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో దేవుడు మల్లయ్య నిర్మించిన ఆడెల్లి పోచమ్మ ఆలయం భక్తులకు కొంగు బంగారంగా నమ్ముకున్న వారికి నమ్ముకున్నంతగా ఎంతో మహిళ గల శక్తి మాత అన్నారు. ఆలయం నిర్మించిన నాటి నుంచి నేటి వరకు ప్రతి సంవత్సరం గ్రామంలోని ప్రతీ ఇంటి నుంచి ప్రతి మహిళ బోనాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి భాజా భజంత్రీలతో ఊరేగింపు నిర్వహించడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా ఈ ఆలయ వార్షికోత్సవం గ్రామంలో రెండు రోజుల పాటు పండుగ వాతావరణం నెలకొందన్నారు. అదే విధంగా పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వార్షికోత్సవం సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక సంప్రదాయాలను భావితరాలకు అందించాలన్నారు. గ్రామంలో వారందరూ కలిసి వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో అభినందనీయమన్నారు. అదేవిధంగా ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కళ్యాణం రాజేశ్వర్, మాజీ సర్పంచ్ దేవరావు, బీఆర్ఎస్ మండల కన్వీనర్ వెంకటేష్, పిడుగు అభిరామ్‌రెడ్డి, కేదేశ్వర్‌రెడ్డి, రమాకాంత్, తోట శ్రీనివాస్, నాయకులు జనార్ధన్, సదాశివ ప్రభాకర్, సదాశివ్, సుదర్శన్‌రెడ్డి, రవికాంత్ యాదవ్, సునీతారెడ్డి, రాంబాయి పల్లవి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.


బోనాలతో మహిళలు


బోనాలతో ర్యాలీగా వెళుతున్న మహిళలు


బోనాల జాతరలో బోనమెత్తిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

మొక్కజొన్నపైనే రైతుల మక్కువ


కుంటాల మండలంలో సాగవుతున్న మొక్కజొన్న పంట

● రబీ సీజన్‌లో ఆసక్తి కనబరుస్తున్న అన్నదాతలు

కుంటాల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజుల నుంచి అన్నదాతలు అన్ని రకాల పంటల సాగుపై నష్టాలనే చవిచూస్తున్నారు. వర్షాకాలంలో మండల రైతులు సాగు చేసే పంటల్లో ముఖ్యమైనది సోయా, పత్తి, వరి పంటలు సాగు చేస్తుంటారు. అయితే గత ఏడాది రైతులను సోయా పంట నిండా ముంచింది. దాంతో పాటు పత్తి పంట కూడా అంతంత మాత్రంగానే దిగుబడులు వచ్చాయి. వరి పైరులో కూడా పలు రకాల తెగుళ్లు ఆశించడంతో వర్షాకాలం, రబీ సీజన్‌లో సైతం రైతులు ఆశించిన మేర దిగుబడులు రాలేదు. దీంతో ఈ యేడు వర్షాకాలంలో సైతం రైతులు సోయా, పత్తి, వరి పంటలను సాగు చేశారు. ప్రస్తుతం సోయా పంట పూర్తయినా పంట పొలాల్లో రైతులు మొక్కజొన్నను సాగు చేస్తున్నారు. అంతేగాకుండా పత్తి పంటలో సైతం ఆశించిన మేర దిగుబడులు రాకపోవడంతో ఆ పంటను తీసి ప్రస్తుతం మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు.

● మొక్కజొన్నతోనే అధిక లాభాలు

మండలంలోని వ్యవసాయ భూములలో రబీ సీజన్‌లో మొక్కజొన్న పంట కాకుండా వేరే ఇతర పంటల్లో ఆశించిన మేర దిగుబడులు రాని కారణంగా ఇక్కడి రైతులు మొక్కజొన్న పంట సాగువైపే మొగ్గుచూపుతన్నారు. దీంతో ప్రస్తుత రబీలో కుంటాల మండలంలో సోయా, పత్తి పంటలు తీసి దాదాపు 4300 ఎకరాల్లో ప్రస్తుతం మొక్కజొన్నను సాగు చేస్తున్నారు. పంటలో ప్రస్తుతం తెగుళ్ల సోకుతున్నప్పటికీ ప్రత్యామ్నాయంగా సాగు చేసేందుకు వేరే పంటలు లేకపోవడం, ఆ పంటలకు ఆశించిన మేర లాభాలు రాకపోవడం మూలంగా రైతులు మొక్కజొన్నవైపే మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం మొక్కజొన్నలకు క్వింటాలుకు రూ.2225 మద్దతు ధర చెల్లిస్తుండగా.. బయట మార్కెట్‌లోనే దాదాపు రూ.2200 వరకు ధర పలుకుతోంది. దీంతో రైతులు మొక్కజొన్నను సాగు చేసేందుక మొగ్గుచూపుతున్నారు.

మూడున్నర ఎకరాలలో సాగు చేశా

: జక్కుల చిన్నయ్య, రైతు, కుంటాల



వర్షాకాలంలో సోయా పంటను సాగు చేసి ఆశించిన మేర దిగుబడులు రాకపోవడంతో ప్రస్తుత రబీ సీజన్‌లో మూడున్నర ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. మొక్కజొన్న పంటతోనైనా ఆశించిన మేర లాభాలు అందుతాయని ఉద్దేశంతో ఈ పంటను సాగు చేస్తున్నాను. గత కొంత కాలంగా ఖరీఫ్, రబీ సీజన్‌లలో అతివృష్టి, అనావృష్టి కారణాల వల్ల నష్టం వాటిల్లుతుంది. ఈసారైనా లాభం చేకూరుతుందన్న ఉద్దేశంతో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నాను.

జర దేఖో!!


రైతు వేదిక పక్కనే పారవేసిన పేకాట ముక్కలు

పేకాటకు అడ్డాగా సోనాల రైతు వేదిక

బోథ్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోనాల గారమంలో ఉన్న రైతు వేదిక పేకాటకు అడ్డాగా మారిందని గ్రామస్థులు వాపోతున్నారు. కొంత మంది పేకాటరాయుళ్లు రైతు వేదికను అడ్డాగా చేసుకుని రాత్రిపూట పేకాట ఆడుతున్నారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అయితే వ్యవసాయ శాఖ అధికారులు రైతు వేదిక తాళం వేసి వెళ్లిపోయిన తరువాత తాళం పగులగొట్టి తలుపులను ధ్వంసం చేసి లోపలికి వెళుతున్నారని అంటున్నారు. సంబంధిత అధికారులు రైతు వేదిక వైపు దృష్టి సారించాలని కోరుతున్నారు.

● వ్యవసాయ శాఖ వారు దృష్టి సారించాలి

రైతు వేదికలో రాత్రి పూట పేకాట ఆడుతున్నారని, వ్యవసాయ శాఖ వారు ఈ విషయంలో దృష్టి సారించాలని సహకార సంఘం డైరెక్టర్ లోలపు పోశెట్టి కోరారు. అంతేగాక ఇటీవల వ్యవసాయ శాఖ తరఫున సబ్సిడీ శనగ విత్తనాలు వచ్చాయని.. ఎవరికీ పంచుతున్నారో కూడా తెలవకుండా పోయిందని వాపోయారు.


రైతు వేదిక తలుపులను ధ్వంసం చేసిన దుండగులు


ధ్వంసమై ఉన్న మరుగుదొడ్ల తలుపులు ఇలా..



• పాలక వర్గం సమావేశ మందిరం

బోనమెత్తిన కుచలాపూర్

- ఘనంగా అడెల్లి పోచమ్మ ఆలయ వార్షికోత్సవం
- పోతరాజుల విన్యాసాలు.. శివసత్తుల పూనకాలు
- భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం
- సంప్రదాయాలను భావితరాలకు అందించాలి : బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



7

పేకాటకు అడ్డాగా సొనాల రైతు వేదిక

- వ్యవసాయ అధికారులు దృష్టి సారించాలని గ్రామస్తుల వినతి




7

ఐటీడీఏ సమావేశాలు ఎప్పుడు?



• అసంపూర్తిగా ఉన్న కోలాం గిరిజనుల గృహాలు



- మూలనపడ్డ ఐటీడీఏ సమావేశాలు
- పరిష్కారానికి నోచుకోని గిరిజన సమస్యలు
- నత్తనడకన గిరిజనుల గృహ నిర్మాణాలు
- పట్టనట్లు వ్యవహరిస్తున్న పాలకులు

“ గిరిజనులకు ఎలాంటి సమస్యలున్నా.. తెలుసుకొని పరిష్కరించే ఐటీడీఏ పాలక వర్గ సమావేశలను నిర్వహించకపోవడం వల్ల ఉమ్మడి జిల్లా గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు నెలలకోసారి నిర్వహించాల్సిన సమావేశాలు మూలనపడ డంతో సమస్యలతో సతమతమవుతున్నారు.

ఉట్నూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని సమగ్ర గిరిజనుల సంక్షేమాభిద్ధి కోసం ప్రతీ మూడు నెలలకోసారి ఐటీడీఏ ఆధ్వర్యంలో పాలక వర్గ సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించాల్సిన పాలకులు.. సమావేశాలపై ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దశాబ్ద కాలంగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఒక్కసారి మాత్రమే పాలక వర్గ సమావేశం నిర్వహించింది. ప్రజాపాలన సాగిస్తామని ఎన్నికల సమావేశంలో ప్రకటించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కావస్తున్నా.. పాలక వర్గ సమావేశం నిర్వహించడం లేదని ఉమ్మడి జిల్లా గిరిజనులు పేర్కొంటున్నారు.

గిరిజనుల అభివృద్ధికి ఐటీడీఏ..

ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల సంక్షేమం అభివృద్ధి కోసం ప్రభుత్వాలు ఉట్నూర్ కేంద్రంగా సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ కార్యాలయాన్ని ఏర్పాటు చేశాయి. 1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో జరిగిన పోలీసు కాల్పుల అనంతరం జిల్లా కేంద్రంలో ఉన్న ఐటీడీఏ కార్యాలయాన్ని ఉట్నూర్‌కు తరలించి ఐఏఎస్ అధికారిని ప్రాజెక్టు అధికారిగా నియమించి 29శాఖల ఆధ్వర్యంలో ఐటీడీఏ కార్యకలాపాలకు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల అభివృద్ధి సంక్షేమం కోసం ముందుగా విద్య, వైద్యం, వ్యవసాయం చిన్న తరహా నీటిపారుదల పథకాలు, గిరిజనులకు ప్రత్యామ్నాయ ఆదాయం కల్పించే పథకాలు ప్రారంభించారు. ప్రతియేటా సుమారు రూ.30కోట్లతో బడ్జెట్ ఏర్పాటు చేసుకొని కేంద్ర సహాయ పథకాలను చేపట్టి గిరిజనుల సంక్షేమం కోసం కృషి చేస్తూ వచ్చారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక..

2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక టీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాల విభజన ఏర్పాటు చేయడంతో ఉమ్మడి జిల్లా గిరిజనులకు ఐటీడీఏ పథకాలు దూరం అవుతూ వచ్చాయి. 2019 అక్టోబరు 30న తెలంగాణ రాష్ట్రంలో ఐటీడీఏ పాలక వర్గ సమావేశం మొదటి సారిగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, హాజరై ఆయాప్రాంతాల అభివృద్ధికి గిరిజనుల సంక్షేమం కోసం అనేక విషయాలు వివరించారు. అధికారంలో ఉన్న మంత్రులు, శాసనసభ్యులు గిరిజనుల అభివృద్ధి సంక్షేమం కోసం కృషి చేస్తునట్లు ప్రకటించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా నిధులు విడుదల చేయకపోవడంతో పథకాలు అంతంత మాత్రమేంగా అందుతున్నాయి.

నత్తనడకన ఇళ్ల నిర్మాణ పథకం..

కేంద్రం విడుదల చేసిన రూ. 20.50 కోట్ల నిధులతో వెయ్యి ఇళ్ల నిర్మాణం చేపట్టిన ఇళ్ల పథకం నత్తనడకన సాగుతోంది. కేంద్ర ప్రభుత్వం స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ పథకం ద్వారా రూ.20.50 కోట్లతో ఉమ్మడి జిల్లాలోని ఆదిమ గిరిజనులైన కోలాం, తోటి, మన్నే గిరిజనుల కోసం వెయ్యి గృహాలు 2022లో మంజూరు చేసి ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కేంద్రం నుంచి తొలి విడత నిధులు వచ్చినా.. రెండో విడత నిధులు రాక పోవడంతో పనులు 75 శాతంలో నిలిచి పోయాయి.

శాఖల పునరుద్ధరణకు ప్రయత్నాలు

ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల అభివృద్ధి సంక్షేమం కోసం ఐటీడీఏలో ఇది వరకు ఉన్న ప్రభుత్వ శాఖలను తిరిగి పునరుద్ధరించాలని కొత్త ప్రభుత్వం భావిస్తోంది. ఐటీడీఏలో మైనర్ ఇరిగేషన్, భూగర్భ జల శాఖ, ఏజెన్సీ విద్యాశాఖ, మత్స్యశాఖ, వ్యవసాయ శాఖ, రెవెన్యూ ఐకేపీ పట్టు పరిశ్రమ, పరిశ్రమల శాఖలు ఎత్తి వేయడం వల్ల గిరిజనులకు ప్రత్యామ్నాయ ఆదాయం లభించడం లేదని భావిస్తున్న ప్రభుత్వం ఈ శాఖల పునరుద్ధరణ కోసం ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఎత్తివేసిన శాఖలు పునరుద్ధరిస్తే గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సంక్షేమానికి మార్గం చేరువ అవుతుందని గిరిజనులు భావిస్తున్నారు.

సెక్టోరియల్ వ్యవస్థతో లాభం..

: రితేష్ రాథోడ్, బీజేపీ నాయకులు ఉట్నూర్



ఉమ్మడి రాష్ట్రంలో ఐటీడీఏలు ఏర్పాటు చేసిన సమయంలో ఉన్న సెక్టోరియల్ వ్యవస్థను పునరుద్ధరించాలి. సెక్టోరియల్ అధికారులు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉండి ఐటీడీఏ పథకాలు గిరిజనులకు చేరువ చేసేవారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి పాలక వర్గ సమావేశాలు నిర్వహిస్తే గిరిజనులకు మేలు జరుగనుంది.

పాలకవర్గ సమావేశాలు నిర్వహించాలి..

:పంద్ర జైవంతు రావు, మాజీ ఎంపీపీ ఉట్నూర్



సమయానుసారం ఐటీడీఏ గవర్నింగ్ బాడీ సమావేశం నిర్వహిస్తే అధికారులు మంత్రుల దృష్టికి స్థానిక ప్రజా ప్రతినిధులు తెచ్చిన సమస్యలు పరిష్కారం అవుతాయి. ఉన్నత అధికారులు సైతం చిత్తశుద్ధితో పాలక వర్గ సమావేశాలు నిర్వహించడానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రికి వివరించాలి.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నేరడిగొండ, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిరికొండ మండల కేంద్రానికి చెందిన బి.లక్ష్మి రూ.39 వేలు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును బోథ్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తుందని ఆయన అన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట సిరికొండ మండల అధ్యక్షులు షేక్ ఇమామ్, బోథ్ మాజీ మండల అధ్యక్షులు కుర్మే మహేందర్, సిరికొండ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు నవీన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాదవ్‌పటేల్, షాదుల్లా, పాలశంకర్, జాదవ్‌కపిల్‌దేవ్, ఇమామ్, ఉపసర్పంచ్ అబ్దుల్ అజీమ్ తదితరులున్నారు.



చెక్కు అందజేస్తున్న ఆడే గజేందర్

ఆదిలాబాద్ ఏజెన్సీ గ్రామాలపై చలిపంజా

- బజార్‌హత్నూర్‌లో కనిష్ఠంగా 10.1 డిగ్రీల సెల్సియస్ నమోదు

ఆదిలాబాద్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ మారుమూల ఏజెన్సీ గ్రామాలపై చలిపంజా విసురుతుంది. రాత్రి పగలు అనే తేడా లేకుండా చలితీవ్రత కనిపిస్తుంది. ఆదివారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 28.3 కాగా కనిష్ఠంగా 12.8 డిగ్రీలుగా నమోదయ్యాయి. అలాగే భీంపూర్ మండలంలో 10.7, బోథ్‌లో 11.1, బేలలో 11.3, ఆదిలాబాద్‌రూరల్ మండలంలో 11.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలిప్రభావంతో ప్రతి కంది పంటలపై ప్రభావం పడుతుందని రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా రైతుకూలీలు మార్నింగ్ వాకర్స్ ఉదయం వేళలో చలి తీవ్రతకు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే డిసెంబర్ మాసంలో చలి తీవ్రత ఎలా ఉంటుందోనని బెంబెలెత్తిపోతున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో చలి మంటలు వేసుకుంటూ వెచ్చదనం పొందుతున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- డీఈవో ప్రణీత



భోజనం రుచిచూస్తున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలనే ఉద్దేశంతో ప్రధాన మంత్రి పోషన్ అభియాన్ పోటీలు నిర్వహించినట్లు డీఈఓ ప్రణీత తెలిపారు. ఆదివారం ఆదిలాబాద్ డైట్ కళాశాల ఆవరణలో ప్రధాన మంత్రి పోషణ్ అభియాన్‌లో భాగంగా మధ్యాహ్న భోజన నిర్వాహకులకు భోజన నాణ్యత పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చేసిన వంటలను డీఈవోతోపాటు న్యాయనిర్ణేతలు వాటి రుచులను చూశారు. పోటీల్లో ఎంపిక వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్నభోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి మార్కులు సాధించాలి

- అసిస్టెంట్ (ట్రైనీ) కలెక్టర్ అభినవ్



రికార్డులను పరిశీలిస్తున్న అసిస్టెంట్ (ట్రైనీ) కలెక్టర్ అభినవ్ అభిజ్ఞ

నేరడిగొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లఖంపూర్, కుంటాల బాలికల ఆశ్రమ పాఠశాలలను ఆదివారం అసిస్టెంట్ (ట్రైనీ) కలెక్టర్ అభినవ్ అభిజ్ఞ సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. పదోతరగతి విద్యార్థులు బాగా కష్టపడి చదివి పరీక్షల్లో బాగా మార్కులు సంపాదించి పాఠశాల పేరు, ఉపాధ్యాయుల పేరు, తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలన్నారు. ప్రతిఒక్కరూ క్రమశిక్షణతో పట్టుదలతో చదవాలన్నారు. అప్పుడే పరీక్షల్లో మంచి మార్కులతో అందరు తప్ప కుండా పాస్ అవుతా రన్నారు. అలాగే విద్యార్థుల కు మెనూ ప్రకారం భోజ నం అందించాలన్నారు. ఆ పాఠశాలలో గల సిక్‌రూం ను పరిశీలించారు. చలికాలం దృష్టిలో ఉంచు కుని విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండా లన్నారు. వెనుకబడ్డ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అన్నారు. ఇందులో పాఠశాల సిబ్బంది తదిత రులున్నారు.

నాగోబా ఆలయంలో పూజలు చేసిన న్యాయాధికారి



నాగోబా ఆలయంలో పూజలు చేసిన న్యాయాధికారి

ఇంద్రవెల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్యదైవం మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ఆదివారం సాయంత్రం జిల్లా న్యాయాధికారి కె.ప్రభాకర్‌రావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం నాగోబా ప్రతిమను అందించి శాలువాలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా మెస్రం వం శీయులతో మాట్లాడి నాగోబా ఆలయ చరిత్ర, నాగోబా జాతర నిర్వాహణ, నాగోబా ఆలయ నిర్మాణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ అండ్ ఎస్పీ నాగేందర్‌గౌడ్, సీఐ మోగిలి, నాగోబా ఆలయ పూజారి మెస్రంషేకు, మెస్రం వంశీయులు నాగ్‌నాథ్, ఆనంద్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముఖడే ఉత్తం, నాయకులు సోమోరే నాగోరావు తదితరులున్నారు.

ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన బొజ్జుపటేల్

ఉట్నూర్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకనిధులు మంజూరు చేయాలని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మబొజ్జు పటేల్ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా డా.బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శనివారం రాత్రి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని ఆదివాసీల ఆరాధ్యదైవం నాగోబా ఆలయ అభివృద్ధితో పాటు ఇంద్రవెల్లి, ఉట్నూర్, జన్నారం, పెంబి, కడెం, మండలాల్లో డబుల్‌లైన్ రోడ్డు నిర్మాణపనులకు నిధులు ఇవ్వాలని కోరారు. పలు అభివృద్ధి పనుల విషయాలపై చర్చించారు. సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

గ్రామాల అభివృద్ధికి చర్యలు

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



కప్పర్ల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

తాంసి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు చేపడతానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని కప్పర్ల గ్రామ సమీపంలో ఉన్న బద్ది పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాను గెలిస్తే ప్రత్యేక కార్యక్రమం చేపడతానన్న కార్యకర్తల కోరిక మేరకు ఇక్కడికి వచ్చానని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ముఖ్యంగా యువకులు గ్రామాల అభివృద్ధి విషయంలో ప్రత్యేక చొరవ చూపాలని సూచిం చారు. టీఆర్ఎస్ కార్యకర్తల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులను తీసుకువస్తానని హామీఇచ్చారు. అన్ని గ్రామాలలో మౌలిక సదుపాయాలను కల్పిస్తానని భరోసా కల్పించారు. కార్య క్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు ఎల్మా రజనీకాంత్‌రెడ్డి, అశోక్‌పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ ఉండాలి

- డాక్టర్ రవికిరణ్ యాదవ్



శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు

మావల ,ఆదిలాబాద్ రూరల్ నవంబరు 24 (ఆం ధ్రజ్యోతి): మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ ఉండాలని ఆర్థికంగా బలోపేతంగా అయినప్పుడే వారి జీవన విధానంలో ముందుకు వెళ్తారని డాక్టర్ రవికిరణ్ యాదవ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సాయి వైకుంఠ ట్రస్ట్ ఆధ్వర్యంలో టైలరింగ్, మగ్గం, ఎంబ్రాయిడరీ, బ్యూటిషన్‌లో ఉచిత శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు ఆదివారం డాక్టర్ రవికిరణ్ సర్టిఫికెట్స్ అందజేశారు.కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మట్ట శ్రీనివాస్, నర్ర నవీన్ యాదవ్, ఆశన్న, ట్రస్ట్ మేనేజర్ చిక్కాల రవి కిరణ్, ట్రస్ట్ టీచర్స్ శ్రావణి, పూజ, వీణ, ప్రవళిక, మీనా, పూజితలు పాల్గొన్నారు.